క్లుప్తంగా

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: అన్నవరం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సుమారు ఐదు గంటల సేపు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.ప్రదీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, అన్నవరం గొడపాలెం, బొమ్మువానిపాలెం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ మధ్యమధ్యలో అందిస్తున్న సమయంలో గ్రామస్తులంతా పనులు చేసుకోవాలని ఆయన సూచించారు.

చేయూత లబ్ధిదారులు ఆందోళన పడొద్దు

తెనాలి: 2023–24 సంవత్సరానికి గానూ చేయూత పథకానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేస్తే సరిపోతుందని తహసీల్దార్ కె.రవిబాబు సోమవారం తెలిపారు. గత సంవత్సరం లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ, ఫీల్డ్ వెరిఫికేషన్ ఫారం, ఫీల్డ్ వెరిఫికేషన్ ఫొటో అప్‌లోడ్ చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఆందోళన పడి ఎవరినీ సంప్రదించవద్దని, ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గడువు మీరిపోయిందని ఎవరైనా చెబితే నమ్మొద్దని వివరించారు. దరఖాస్తుకు తగిన ధ్రువీకరణలు అందిస్తే చాలని చెప్పారు.

శిబిరంలో 10 మంది రక్తదానం



అత్తోట(కొల్లిపర): మండలంలోని అత్తోటలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు యర్రు శివ రామకృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకొని నిర్వహించిన ఈ శిబిరంలో పది మంది రక్తదానం చేశారు. తొలుత యర్రు శివరామకృష్ణతో ఎమ్మెల్యే కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివరామకృష్ణ మిత్రులతో కలసి ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా పరిశీలన

కొల్లిపర: మండలంలో ఓటరు జాబితాల పరిశీలన పారదర్శకంగా జరుగుతోందని తహసీల్దార్ జి.నాంచారయ్య తెలిపారు. ఓటరు జాబితా పరిశీలన ముగింపు రోజు కావడంతో ఆయన సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇల్లూ తిరిగి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. సాయంత్రానికి ప్రతి గ్రామంలో సర్వే 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

గుండెపోటుతో యార్డులో కార్మికుడి మృతి

గుంటూరు రూరల్: గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరరావు (50) మిర్చి యార్డులో కార్మికుడుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం యార్డులో పనికి వచ్చాడు. అనంతరం పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి, అతనిని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. సమాచారం తెలిసిన నల్లపాడు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, పరిశీలించారు. కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

చేబ్రోలు: మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి, వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పొన్నూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన బాలికను జడవల్లి గ్రామానికి చెందిన మిక్కిలి రాఘవేంద్ర ప్రేమ పేరుతో అనేకసార్లు బలవంతంగా లైంగిక వేధింపులకు గురిచేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు రాఘవేంద్రపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హసీమ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చరక మహర్షి జయంతి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా భాస్కర్ ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య పితామహుడు చరక మహర్షి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ గోకవరపు వెంకట కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆస్పత్రి డాక్టర్ జి.వై.ఎస్. భాస్కర్, డాక్టర్ జి.లక్ష్మీ శ్రీవాణి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

ఎత్తిపోతల పథకం పనుల్ని వెంటనే ప్రారంభించాలి

- సబ్ కలెక్టర్‌కు చానల్ సాధన పోరాట కమిటీ వినతి
- కుల ధ్రువీకరణ కోసం మాస్టిన్ కులస్తుల అర్జీ
- 'స్పందన'లో ఐదు అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల పరిధిలో గల పెదవడ్లపూడి హైలెవెల్ చానల్ ఎత్తిపోతల పథకం నిర్మాణ పనుల్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ చానల్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేశారు. స్పందన సమావేశంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పెదవడ్లపూడి హైలెవెల్ చానల్‌పై కమిటీ కన్వీనర్ ములకా శివసాంబిరెడ్డి, జెట్టి బాలరాజు, కావూరి వాసుదేవరావు, మైలా వెంకట రామరాజు అర్జీని అందజేసి, సమస్యను వివరించారు. ఐదు మండలాల్లోని 26 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఎత్తిపోతల పథకం నిర్మాణ పనుల్ని రూ.9 కోట్లతో 2017లో ప్రారంభించినట్టు గుర్తు చేశారు. 70 శాతం పనులు పూర్తయినా, సంబంధిత కాంట్రాక్టరుకు ఆరేళ్లుగా బిల్లులు చెల్లించని కారణంగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. దుగ్గిరాల మండల గ్రామం తుమ్మపూడిలో నివసిస్తున్న 'మాస్టిన్' (ఎస్సీ) కులస్తులు తమకు కుల ధ్రువీకరణ ఇప్పించాల్సిందిగా అభ్యర్థిస్తూ సబ్ కలెక్టర్‌కు అర్జీనిచ్చారు. 2020లో చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం జీవోను ఇచ్చి, సర్టిఫికెట్లను ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం రెన్యువల్ చేసి , ఆధార్ కార్డుకు కుల ధ్రువీకరణ జత చేయించేలా చూడాలని కోరారు. వీటితోపాటు రెవిన్యూ–1 పోలీస్–1, మున్సిపాలిటీ ఒకటి చొప్పున స్పందన సమావేశంలో మొత్తం అయిదు అర్జీలు వచ్చినట్టు సబ్ కలెక్టర్ తెలియజేశారు.

కొలకలూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' ప్రారంభం

ఎమ్మెల్యే శివకుమార్‌కు గ్రామస్తుల సాదర స్వాగతం



కొలకలూరులో ఎమ్మెల్యే శివకుమార్‌కు బొట్టు పెడుతున్న మహిళ

తెనాలి టౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూరల్ మండలం కొలకలూరులో సోమవారం ప్రారంభమైంది. బీసీ కాలనీలో పార్టీ నాయకులు కొలకలూరి వసంత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తీన్‌మార్ బ్యాండ్ మేళాలు, తప్పెట్లతో ఎమ్మెల్యే శివకుమార్‌కు ఘన స్వాగతం పలికారు. టపాసులు కాల్చారు. తొలుతగా గ్రామ సెంటర్‌లో ఉన్న వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. బీసీ కాలనీలో వార్డు సభ్యురాలు కమాదుల స్వరూపరాణి ఆధ్వర్యంలో మహిళలు ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి, తిలకం దిద్దారు. అనంతరం సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. మురుగు నీరు పారుదల కావడంలేదని, సైడు కాల్వలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ హైటెన్షన్ తీగలను తొలగించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. సమస్యల్ని సచివాలయ ఉద్యోగులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సచివాలయం–2 పరిధిలో రూ.25 కోట్లతో ప్రజలకు సంక్షేమ పథకాలు ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామని తెలిపారు. గ్రామంలో 701 మంది రైతులకు రైతుభరోసా అందించామని చెప్పారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మరో రెండు నెలల్లో మంజూరు చేస్తామని వెల్లడించారు. పేదవాడి జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీ సభ్యులు దోసపాటి నాగదేవిక, కాలిశెట్టి ఫణికుమార్, చెక్కా సీతమ్మ, జేసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, నేతలు కొలకలూరి నాగేశ్వరరావు, పినపాటి అనిల్, మల్లవరపు బుల్లయ్య, కోడూరు రమేష్, గంపల పెద్దబ్బాయి, భర్తిపూడి బాపిరాజు, రావూరి జేవియర్, సుమతి, ప్రసాదం సురేష్, షేక్ జానీ, జిలాని, దూళ్ల శ్రీనివాసరావు, వీరమల్లు కార్తికేయ, మల్లవరపు విజయ్, జయరాజు, అంచే రోశయ్య, తులాబందుల లక్ష్మీ కోటేశ్వరరావు, నలుకుర్తి జోసఫ్, వీరారెడ్డి, రాజయ్య, ఎంపీడీవో విజయ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి వై.వి.డి. ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల క్రీడా ప్రతిభ



రెండు రాష్ట్రాల రీజియన్ స్థాయిలో తృతీయ స్థానం సాధించిన వాలీబాల్ జట్టు



జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించిన హరిణి

తెనాలి: కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్ స్థాయి ఆటల పోటీల్లో తెనాలి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సత్తాచాటారు. హైదరాబాద్‌లోని బొల్లారంలో ఈనెల 16, 17 తేదీల్లో జరిగిన పోటీల్లో వాలీబాల్‌లో తెనాలి విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. కె.క్లెన్సీ కెప్టెన్సీలో బి.అనూష, జి.సాహితి, డి.పూజిత, టి.విన్సీ, టి.భార్గవి, జి.హిమశ్రీవిద్య, కె.హరిహంసిక ఆడారు. అంతకుముందు జరిగిన అథ్లెటిక్స్ మీట్‌లో తెనాలి కేంద్రీయ విద్యాలయ 12వ తరగతి విద్యార్థిని పి.హరిణి జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించింది. ఈ విజయంతో వచ్చే నెలలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైంది. ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారుల్ని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ బి.రవికుమార్, కోచ్ డి.అజయ్ అభినందించారు.

26న 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక

తెనాలి: 'ఆహ్వానం లక్ష్మి' సంస్మరణలో భాగంగా ఈనెల 26న కవి, సామాజిక ఉద్యమాల కార్యకర్త కృపాకర్ మాదిగ కవిత్వం 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక జరగనుంది. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు కె.వి. రాఘవరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. దళిత ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా వైస్ చాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రారంభించే చర్చలో ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య, ఆచార్య పొన్నెకంటి రత్నాకర్, రచయిత్రి గంగవరపు సునీత, కవి కృపాకర్ మాదిగ పాల్గొంటారు. గత ఏప్రిల్ 17న మృతి చెందిన 'ఆహ్వానం లక్ష్మి'కి నివాళిగా ఏడాదిపాటు ప్రతినెలా ఒక మంచి పుస్తకంపై చర్చను జరపాలని భిన్న స్వరాలు తీర్మానించుకుంది. ఆ ప్రకారం నెల నెలా చర్చావేదికను నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే.

పార్టీ కోసం పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు

జేసీఎస్ కన్వీనర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని, వారిని పార్టీ అక్కున చేర్చుకుంటుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి చెప్పారు. తాడికొండలోని శ్రీ సాయిబాబా కల్యాణ మండపంలో సోమవారం జేసీఎస్ కన్వీనర్లకు జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడారు. రానున్న రోజుల్లో జేసీఎస్ కన్వీనర్లది కీలకపాత్ర కానున్నట్లు చెప్పారు. వారి పనితీరును గుర్తుపెట్టుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 10 లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వం పార్టీ నాయకుల్ని, కార్యకర్తలని వాడుకుని వదిలేసిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టదని వారికి తగిన న్యాయం చేస్తోందని వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నాటి నుంచి ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. ఏ మంచి కార్యక్రమం తలపెట్టినా అడ్డగోలు రాతలు రాస్తూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలు నిజాలు గ్రహిస్తున్నారన్నారు. అందుకు నిదర్శనం ఇప్పుడు జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలేనన్నారు. ప్రతి గడపలోను సంక్షేమ వెల్లివిరుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల ఇళ్ల స్థలాలు ఇస్తే, రాజధానిలో 51 వేల మంది పేదలకి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నేతలు కోర్టులకు వెళుతున్నారని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే మురికివాడలుగా మారుతాయి అని అనటం వెనుక వారికి పేదల పట్ల ఉన్న చులకనభావం ఏంటో అర్థం అవుతోందన్నారు. పేదలు అక్కడ నివసించకూడదని వివక్షత చూపుతున్నారని తెలిపారు. ఇటువంటి పార్టీలు గెలిస్తే పేదల భవిష్యత్తు ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. బ్రిటిష్ వారిలా విభజించు పాలించు సిద్ధాంతాన్ని తెలుగుదేశం పార్టీ అవలంభిస్తుందన్నారు. టీడీపీ హయాంలో ఏ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదని, ఏ ఒక్కరికి సెంటు భూమి కూడా ఇవ్వలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జేసీఎస్ కన్వీనర్లు కీలకపాత్ర వహించాలన్నారు. పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'మణిపూర్‌లో మంటలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పెనుగొండ లక్ష్మీనారాయణ, సింగారావు తదితరులు

తెనాలి: మణిపూర్‌లో జరిగిన మారణకాండపై ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రచురించిన ద్విభాషా సంకలనం 'మణిపూర్ మంటలు' పుస్తకాన్ని జబల్‌పూర్‌లో సోమవారం జరిగిన 18వ జాతీయ మహాసభల వేదికపై ఆవిష్కరించారు. అరసం ఏలూరు శాఖ ప్రచురించిన ఈ పుస్తకానికి సంపాదకవర్గంలో గుంటూరు జిల్లాకు చెందిన కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీ ఉన్నారు. పుస్తకావిష్కరణలో జిల్లాకు చెందిన అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, జి.ఓబులేసు, ఏఎంఆర్ ఆనంద్, తెనాలికి చెందిన అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు పాల్గొన్నారు.

ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యం

మేయర్ కావటి



అధికారులతో కలసి మ్యాపులను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా అధిక ప్రాధాన్యత ఇస్తోందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం మజ్లిస్ ఉలామా జమైత్ ఉలామా ఆర్గనైజేషన్‌కు స్థలం కేటాయించడానికి గానూ నగరంలోని బీఆర్ స్టేడియం తూర్పు వైపు గల ఖాళీ స్థలాన్ని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద గల రెడ్ ట్యాంక్ పడమర వైపు గల ఖాళీ స్థలాన్ని నగర పాలక సంస్థ అధికారులు, ముస్లిం మత పెద్దలతో కలసి మేయర్ పరిశీలించారు. తొలుతగా ఖాళీ స్థలాల మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మజ్లిస్ ఉలామా జమైత్ ఉలామా ఆర్గనైజేషన్ సభ్యులు, ముస్లిం మత పెద్దలు కొన్ని రోజుల కిందట తనను కలసి పేద ముస్లిం విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి వివరించారన్నారు. శాశ్వత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నగరపాలక సంస్థ ఖాళీ స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బీఆర్ స్టేడియం తూర్పు గల ఖాళీ స్థలాన్ని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రెడ్ ట్యాంక్ పడమర వైపు గల ఖాళీ స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి లెటర్ రాస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్ షేక్ మీరావలి, పార్టీ నేత షేక్ నూరి ఫాతిమా, నగరపాలక సంస్థ సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ముస్లిం మత పెద్దలు ముఫ్తి అబ్దుల్ బాసీద్, ముఫ్తీ ఆసిఫ్, అబ్దుల్ గఫార్, హఫీజ్ అబ్దుల్ ఖాదీర్, ముఫ్తీ అబ్దుల్ కవి, మౌలానా ఇస్మాయిల్, ముఫ్తి రహమతుల్లా, అధికారులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి



ధర్నా చేస్తున్న రైల్వే ఉద్యోగులు

తెనాలి రూరల్: సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు, సభ్యులు తెనాలి రైల్వే స్టేషన్‌లోని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైల్వేలో ప్రైవేటీకరణ, మానిటైజేషన్లను రద్దు చేయాలని, ఖాళీల్ని భర్తీ చేయాలని కోరారు. పోస్టుల భర్తీపై నిషేధాన్ని ఎత్తి వేయాలని, అన్ని కేటగిరీలకు క్యాడర్ పునర్వ్యవస్థీకరణ వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అన్ని సేఫ్టీ కేటగిరీలకు రిస్క్ అలవెన్స్ మంజూరు చేయాలని, అలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ డిమాండ్ మేరకు రేటును పెంచాలని విన్నవించారు. కార్యక్రమంలో జి. రవిబాబు, ప్రసన్నకుమార్, రామస్వామి, రాజశేఖర్, వరప్రసాద్, సుబ్బారావు, చతుర్వేది, సాంబిరెడ్డి, పిచ్చయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక సేవలో కీలకపాత్ర పోషించాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



ఫ్యాన్లు అందిస్తున్న కెనరా బ్యాంక్ సిబ్బంది

గుంటూరు వెస్ట్: సామాజిక సేవలో కార్పొరేట్ సెక్టార్ కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సామాజిక సేవలో భాగంగా ప్రభుత్వ హాస్టల్స్‌లో అమర్చేందుకు గానూ 100 సీలింగ్ ఫ్యాన్లను కెనరా బ్యాంక్ అధికారులు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవలో కార్పొరేట్ వ్యవస్థ అందిస్తున్న సహకారం మరువలేమని, ఇది మరింత విస్తరిస్తే ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పలువురు క్రీడాకారులకు చేయూతతో పాటు సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి సాయాన్ని అందించాలనుకునే వారు నేరుగా తనను గానీ, అధికారులను గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, డెప్యూటీ కలెక్టర్ లలిత, కెనరా బ్యాంక్ ఆర్ఎం శ్రీనివాస్ కణ్ణన్, చీఫ్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఎల్‌డీఎం రత్న మహీపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ఎం హైస్కూలులో టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కౌన్సిలర్ సురేంద్ర

తెనాలి అర్బన్: ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో కేంద్ర ప్రభుత్వం నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఒకటో వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు ల్యాబ్‌లు దోహదపడతాయని చెప్పారు. ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన వివిధ సెన్సార్లు, త్రీడీ ప్రింటర్, ఎలక్ట్రానిక్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన టోల్స్, టెలిస్కోప్ వంటివి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజా కిశోర్, ఉపాధ్యాయులు శర్మ, బెల్లకొండ వెంకట్, ప్రసాద్, ఆదిలక్ష్మి, పీఎంసీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం



ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న నాక్ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలను సోమవారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ప్రతినిధుల బృందం సందర్శించింది. కళాశాలలో విద్యాబోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు తదితర అంశాల్ని పరిగణలోకి తీసుకుని నాక్ గ్రేడ్ కోసం సిఫార్సు చేయనున్నారు. నాక్ ప్రతినిధులు డాక్టర్ అమితాబ్ సక్సేనా, డాక్టర్ అనూప్ కుమార్ దే, డాక్టర్ సుందరరామన్‌కు కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు స్వాగతం పలికారు. అనంతరం వారు పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యంతో వేర్వేరుగా సమావేశమయ్యారు. నాక్ ప్రతినిధుల బృంద పరిశీలన మంగళవారం కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త పి. గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్.ఆర్. నగర్‌లో మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



తెనాలి అర్బన్: మారీసుపేటలోని డాక్టర్ రావి రవీంద్రనాథ్‌నగర్, చంద్రబాబునాయుడు కాలనీలో మురుగును బయటకు పంపేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. సాక్షి దినపత్రికలో సోమవారం 'మురుగు ముంచెత్తుతోంది' అనే శీర్షికన కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు జెబీసీతో మురుగు పోయేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మురుగును బయటకు పంపి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలోనూ రాణించి జిల్లాకు పేరు తేవాలి



క్రీడాకారులను అభినందిస్తున్న చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 13న జరిగిన రాష్ట్రస్థాయి అండర్–20 ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన జట్టుకు కాంస్యం, వ్యక్తిగత విభాగాల్లో సువర్ణ రాజు రజతం, ఆకురాతి లీలా వెంకటేష్, ఎస్‌కే ఫిరోజ్ ఆలీ, వల్లెపు పుష్పాంజలి కాంస్య పతకాలు సాధించారు. వీరిని సోమవారం స్థానిక బీఆర్ స్టేడియంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు అభినందించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం క్రీడా సాధనతో పాటు పోటీల్లో కూడా పాల్గొనాలని సూచించారు. జాతీయ పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరుతేవాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన వారంతా గుజరాత్‌లో త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు తెలిపారు.

రేపటి నుంచి ఈఎస్ఐ క్యాంపు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ శిబిరాన్ని ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా కార్డుల్ని అప్డేట్ చేసుకోవాలని ఆమె సూచించారు.

మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం ప్రారంభం



మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ పి.అనూష, డాక్టర్ సత్యవతి, డాక్టర్ ప్రియాంక, మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, జయలక్ష్మి, శ్రీనివాసు, నరసింహారావు, జాన్ ఫెన్నీ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐగా శివరామయ్య బాధ్యతల స్వీకరణ



తెనాలి రూరల్: తెనాలి ట్రాఫిక్ ఎస్ఐగా బి. శివరామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పని చేస్తున్న ఆయన వ్యక్తిగత కారణాలతో కొద్దికాలంగా సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన్ను ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.